క్లుప్తంగా

ముగిసిన పాలిసెట్ కోచింగ్

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వి.వి.అగ్రహారంలో గత నెల 17న ప్రారంభించిన పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థినీవిద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందారు. ఈ సందర్భంగా వడ్డాదికి చెందిన వ్యాపారి పలుకూరి భైరవ కృష్ణ ..ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సమన్వయకర్తలు రామారావు, జ్ఞాని, ఉపాధ్యాయులు హరికృష్ణ, తలుపులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్వామినాయుడు

రోలుగుంట: స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సంఘం ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ శాఖ జిల్లా అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.వి.స్వామినాయుడు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు.సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. వెలుగు ఏపీఎం సాధన, స్త్రీనిధి మేనేజర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

కె.కోటపాడు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తకాలు చదవాలని స్థానిక శాఖాగ్రంథాలయం అధికారి సౌమ్య అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో ఆమె పుస్తకాలు చదివించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న కథలు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు చదవాలని సౌమ్య సూచించారు.

అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా అప్రమత్తం

నాతవరం: ఎండ తీవ్రత తగ్గే వరకు వృద్ధులు ఇంటి నుంచి బయటకు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలోని చమ్మచింత గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మామిడి రైతులకు సంచుల పంపిణీ

మాకవరపాలెం: మామిడి కాయల సంరక్షణ కోసం రైతులకు సంచులు పంపిణీ చేస్తున్నట్టు ఉద్యానవనశాఖ అధికారి రాధిక తెలిపారు. ఆమె మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఒక్కో రైతుకు రెండువేల సంచుల చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో నర్సీపట్నం, మాకవరపాలెం, రోలుగుంట మండలాల్లో తోటబడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన గవరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సలాది సాయిశ్రీ (577), ఎం.దాక్షాయని(553), బి.జ్యోత్స్న (536), ఏ.సునీత (509), ఎ.పూజిత (502)లను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం కె.గీతాదేవి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల(విద్యా) కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఎ.రవిశంకర్, డి.వి.వి.రమణి, కె.విశ్వనాథ్, వి.ఆర్.వరహాలుదొర,ఎ.ఎస్.కృప పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

చోడవరం రూరల్: భారత దేశ రెజ్లర్ ప్రతినిధులైన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.గౌరీశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్ల పట్ల పోలీసులు సైతం అమానుషంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.

అవినీతికి తావులేకుండా సీఎం జగన్ పాలన

- ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు
- వేచలంలో గడపగడపకు మన ప్రభుత్వం
- కల్లాల్లో నివాసం ఉంటున్న ప్రజల చెంతకు బైక్‌పై వెళ్లిన బూడి
- జగన్నాథపురం కాలువపై శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



వేచలం కర్రి వారి కల్లాల్లో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



బైక్‌పై వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అర్హత కలిగిన చిట్టచివరి లబ్ధిదారుడికి సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించలన్నా దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు మంగళవారం నిర్వహించారు. కర్రి వారి కల్లాలు, అచ్చన్న వారి కల్లాలు, పోతురాజు వారి కల్లాలు, కిత్తన్న వారి కల్లాలు, కలింగల వారి కల్లాలు, గొల్లు వారి కల్లాలు, మీద బండారు వారి కల్లాలు, మీద రెడ్డి వారి కల్లాలు, గొల్లవారి కల్లాల్లో ద్విచక్రవాహనంపై పర్యటించారు. కల్లాల్లో నివాసం ఉంటున్న ప్రజల చెంతకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, యోగ క్షేమాలతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్రి వారి కాల్లాల వద్ద జగన్నాథపురం వైపు వెళ్లే పంట కాలువ శ్లాబ్ కల్వర్టుకు ఆయన శంకుస్థాపన చేశారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అచ్చన్న వారి కల్లాలు వద్ద 20 వేల లీటర్ల మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కల్లాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు మంచినీరు, రహదారుల సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిత్య పరితపిస్తూ అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన సాగిస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు చిన్నంనాయుడు, వేచలపు కుమార్, వంటాకు సింహాద్రప్పడు, వేచలపు సూరిబాబు, వేచలపు కృష్ణ, కర్రి కొండబాబు, బత్తినాయుడు, కోడూరు వెంకటరావు (గురుస్వామి), సిరపరపు సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రమణ మృతి



వేమవరపు వెంకట రమణ (ఫైల్)



రమణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: మాజీ సర్పంచ్, ప్రస్తుత మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ తండ్రి వేమవరపు రమణ(ఎస్‌పీఎల్) (80) మంగళవారం మృతి చెందారు. మాడుగుల సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారు.రమణ మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడిగా పనిచేసి, మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందారు. మాడుగుల దసరా పాక ఆడిటోరియం నిర్మాణంతో పాటు పంచాయతీ ఆడిటోరియం, దేవాలయాల జీర్ణోద్ధరణ, పలు భవనాల నిర్మాణంలో ప్రముఖ పాత్రపోషించి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారు. ఆయన మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం బూడి నివాళి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు మంగళవారం ఎంపీపీ రామధర్మజ కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటరమణ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీలు రాజారామ్, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, ఓఎస్‌డీ ఎం .పోలినాయుడు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వార్డు మెంబర్లు ఎస్.జ్యోతి, వేమన గణేష్, మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

కె.కోటపాడు: గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 24 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు. ప్రతి నెలా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరపడం ద్వారా రక్తహీనత, ఇతరత్రా సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు. అధిక పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇవో కె.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభయాన్ కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు వైద్యాధికారి కె.లీలాప్రసాద్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీలో వైద్యాధికారి నాయుడు గర్భిణులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం సహించను

ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

రోలుగుంట: సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని నర్సీపట్నం ఆర్డీవో జయరాం హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్ హెచ్.త్రివేణి, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు, విద్యార్థుల నుంచి వస్తున్న వినతుల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే విధుల్లో అలసత్వం వహించొద్దన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో ప్రజలకు మేలు



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

నాతవరం: ప్రభుత్వం నూతనంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, సమస్యలను పరిష్కరించేందుకే చక్కటి అవకాశం ఏర్పడుతుందని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని టీవీలో వీక్షించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఎలాంటి సమస్యనైనా నేరుగా సీఎం కార్యాలయానికి తెలియజేసేందుకు చక్కటి కార్యక్రమాన్ని సీఎం రూపొదించారని చెప్పారు. ఈకార్యక్రమం ఉద్దేశ్యాన్ని మండల స్థాయి అధికారులకు తెలియజేశారు, ఈకార్యక్రమంలో ఏఎస్ఐ విజయకుమార్, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల బాక్సింగ్ విన్యాసాలను తిలకించారు. శిక్షణ పొందుతున్న చిన్నారులకు డీఎస్పీ పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐగా పని చేస్తున్న గణేష్ స్పోర్ట్స్ కోటాలోనే పోలీసు ఉద్యోగం సాధించారన్నారు. సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్స్ బోశం శివ, కోచ్ శేఖర్, కోచ్ వీరబాబు పాల్గొన్నారు.

అక్రమంగా మోటార్ల ఏర్పాటుపై ఫిర్యాదు

రోలుగుంట: కుసుర్లపూడి గ్రామంలో తాగునీటి బోర్లకు అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసినవారిపై గ్రామానికి చెందిన బి.రామలింగం, సీహెచ్.శ్రీను మంగళవారం ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవోపీఆర్డీవో స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శితో విచారణ జరిపి అక్రమ కనెక్షలన్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

నేడు జైతవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

చీడికాడ: మండలంలోని జైతవరంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొళ్ళవిల్లి రాజబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కె.కోటపాడు జెడ్పీటీసీ, జిల్లాపరిషత్ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, పాల్గొనున్నారని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య పట్టుకున్నారు. మండలంలోని కొండలఅగ్రహారం సమీపంలో ఉన్న సర్పానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీఐ మంగళవారం పట్టుకున్నారు. కేసు నమోదు చేయాలని ఎస్ఐ రామకృష్ణారావును ఆదేశించారు.

మొదటి విడతగా 14,933 పాఠ్యపుస్తకాలు



బస్సులోంచి పాఠ్యపుస్తకాలు దించుతున్న కూలీలు

మాకవరపాలెం: మండలానికి మొదటి విడతగా 14,933 పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సుమారు 32 వేల పాఠ్యపుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో మొదటి విడతగా మంగళవారం 14,933 పుస్తకాలు స్థానిక ప్రాథమిక పాఠశాలకు చేరాయి. మిగిలినవి కూడా త్వరలో వస్తాయని, పాఠశాలల ప్రారంభం నాటికి పుస్తకాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తామని ఎంఈవో నరేష్ తెలిపారు.

సచివాలయాల్లో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్టర్‌లను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కె.కోటపాడు: గ్రామసచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను పంచాయతీ కార్యదర్శులు పారదర్శకంగా నిర్వహించాలని కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో మొదటి విడత రీసర్వే పూర్తయిన గ్రామాల కార్యదర్శులకు మంగళవారం కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. శిక్షణకు హాజరైన ఎ.భీమవరం, పోతనవలస, సింగన్నదొరపాలెం, డి.అగ్రహారం, ఆర్.ఎస్.పాలెం, కె.జె.పురం, సూర్రెడ్డిపాలెం, చిన సోంపురం, ఎస్.గజపతినగరం పంచాయతీ కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు రిజిస్టర్‌లను అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ శంకర్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ నమూనా పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



యామినికి నగదు బహుమతిని అందజేస్తున్న కె.వి.రమణ

దేవరాపల్లి: స్థానిక ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కె.వి. రమణ, కొరుపోలు శ్రీను అభినందించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సహకారంతో వీరు గత నెల 25 నుంచి ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.ఈ సెంటర్‌లోని 80 విద్యార్థులకు మంగళవారం నమూనా పాలిటెక్నిక్ పరీక్ష నిర్వహించారు. అధిక మార్కులు సాధించిన సోమిరెడ్డి యామినికి విశాఖపట్నం పాలిటెక్నిక్ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రమణ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన కేతిరెడ్డి మేఘన, సిహెచ్. శివరామకృష్ణలకు కోసూరి రవిశంకర్ సమకూర్చిన నగదు బహుతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, జ్ఞానేశ్వరరావు, ఉప్పు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ కొలువు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న పుప్పాల అప్పలరాజు ఎంపీపీ రామధర్మజ తదితరులు



జంపెనలో నూతనంగా నిర్మించిన మోదకొండమ్మ ఆలయం

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా కొలువు ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శ్రీనాదు శ్రీనివాసరావు, దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడియ్యానాయుడు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావులతో పాటు భక్తులు శిరసున పెట్టుకుని, ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లారు. కోటబయలు సతకం పట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనం కోసం ఘటాలను ఇక్కడ నెల రోజుల పాటు ఉంచుతారు.

ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: మండలంలో వి.వి.అగ్రహారం మోదమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాలాధారణ చేసిన భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని ఎరుకువాడ, లక్ష్మీపురం, కొత్తూరు ప్రజలు దర్శించుకున్నారు.

మోదకొండమ్మ విగ్రహప్రతిష్ఠాపన రేపు

మాడుగుల: మండలంలోని జంపెనలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన మోదకొండమ్మ ఆలయంలో ఈ నెల 11న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన జరపనున్నట్టు చెప్పారు.

ఘనంగా సన్యాసమ్మ గాలాల శూలాల మహోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: మండలం కేంద్రం దేవరాపల్లిలో సన్యాసమ్మ అమ్మవారి నెల పండగలో భాగంగా మంగళవారం గాలాల శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు తదితర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా మంగళవారం తెల్లవారజామున అన్ని వీధుల్లో ఉజిడి బండిని ఊరేగించారు. అనంతరం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. సన్యాసమ్మ అమ్మవారి నెల పండగను భారీ స్థాయిలో జరిపేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



ఆయాలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, అధికారులు

నాతవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో చిక్కుడుపాలెం, నాతవరం -3 అంగన్‌వాడీ, గొలుగొండ మండలం కొత్తమల్లంపేట కేంద్రాల్లో కొత్తగా నియమితులైన ఆయాలకు నియామక పత్రాలను మంగళవారం ఎంపీపీ లక్ష్మణమూర్తి, గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు జీతాలు పెంచారన్నారు. గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎం.బెన్నవరం ఎంపీటీసీ సభ్యులు తమరాన లోవ కృష్ణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగ జ్యోతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఆర్డీవో జయరాం, డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఆర్డీవో, డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ ఆర్డీవో కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 1902 నంబర్‌కు ఫోన్ చేస్తే నేరుగా సీఎం కార్యాలయానికి కనెక్ట్ అవుతుందన్నారు. ప్రజా ఫిర్యాదులు, సంక్షేమ పథకాలు, భూ సంబంధిత అంశాలపై నేరుగా సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు ప్రజలకు వెసులబాటు కల్పించిందన్నారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయమాధవి కార్యక్రమాన్ని వీక్షించారు.

రాయపురాజుపేట సొసైటీకి పావలా వడ్డీ రాయితీ

చోడవరం రూరల్: రాయపురాజుపేట ప్రాథమిక సహకార సంఘానికి 2020-21 సంవత్సరానికి పావలా వడ్డీ రాయితీ రూ.6,83,841 విడుదలైనట్టు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి దొడ్డేడ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సంఘ సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు వడ్డీ రాయితీని జమ చేసినట్టు మంగళవారం తెలిపారు. కొందరు సభ్యులకు నగదు రూపంలో అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు కామాక నూకరాజు, బొడ్డేడ సన్యాసిరావు, సీమునాపల్లి సర్పంచ్ కొరికూటి భోగేష్, సంఘ సీఈవో మళ్ల సంతోషిరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే చేసిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్

నాతవరం: జగనన్న భూరీసర్వే పథకంలో భూముల రీసర్వే పూర్తయిన రైతులకు కొత్తగా పాస్ పుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నట్టు తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. పాస్‌పుస్తకాల కోసం ఎవరికీ నగదు చెల్లించవలసిన అవసరం లేదని ఆయన చెప్పారు. రీసర్వేకు సంబంధించిన పలు విషయాలపై మంగళవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో నాలుగు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులకు కొత్తగా పాస్‌పుస్తకాలు ప్రభుత్వం పంపించిందన్నారు. పాట్టినాగన్నదొరపాలెంలో 64మందికి, చొల్లంగిపాలెంలో 41, కె.వి.శరభవరంలో 55, కృష్ణాపురం అగ్రహారంలో 35 మంది రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు వచ్చినట్టు చెప్పారు. ఈ పుస్తకాలను స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం కేటాయించిన గ్రామ సచివాలయాల్లోనే త్వరలో ప్రారంభిస్తారన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు ,ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.